క్లుప్తంగా

నేడు ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్ఠు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రేపు అయ్యప్పస్వామి మండల పూజ

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో వెలసిన శ్రీహరిహర పుత్రుడు అయ్యప్పస్వామి 38వ మండల పూజ మహోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు అయ్యప్పస్వామి భక్త మండలి పెద్దలు తెలిపారు. ఉదయం నుంచి యాగశాల ప్రవేశం నిర్వహించి గణపతి పూజ, స్వస్తి వాచనం, పంచామృతాభిషేకం, అనంతరం ఇష్టదేవతా హోమాలతోపాటు అయ్యప్పస్వామికి అంబుళం పూజ, పడిపూజ కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అయ్యప్ప దీక్ష భక్తులకు బిక్ష ప్రసాదం(అన్నదాన కార్యక్రమాన్ని) నిర్వహించనున్నారు. సాయంత్రం కేరళ వాయిద్యాలతో అత్యంత వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్ప మొదటిసారి మాల వేసిన కన్య స్వాములు కలశాలు చేతబూనేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఘనంగా గౌరమ్మ గ్రామోత్సవం

వల్లూరు : మండల పరిధిలోని పెద్ద లేబాక గ్రామంలో గౌరమ్మ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని రామాలయంలో పౌర్ణమి రోజున ఆదివారం అమ్మవారిని కొలువు దీర్చి నిత్యం పూజలు నిర్వహిస్తూ వచ్చారు. గురువారం ఆలయం వద్ద నుండి జల్లెడలో కొలువు దీర్చిన అమ్మవారిని భక్తులు చేతులపై మోస్తూ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఒక పక్క వర్షం కురుస్తున్నా యువకులు ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులు అమ్మవారికి కాయ, కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని పెద్దపుత్త గ్రామంలో గౌరమ్మ తిరుణాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యోతి ఉత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

వంట పాత్రలు పంపిణీ



వంట పాత్రలు అందజేస్తున్న ఎంఈఓ శివప్రసాద్

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వం అందించిన మధ్యాహ్న భోజనం పథకంను అవసరమైన వంట పాత్రలు పంపిణీ చేసినట్లు ఎంఈఓ శివప్రసాద్ తెలిపారు. బుధవారం ఆ పాత్రలను ఆయా పాఠశాలలకు పంపిణీ చేశారు. ఏ కెటగరీలో 28 పాఠశాలు, బి కెటగిరీలో 8 పాఠశాలు, సీ కెటగిరీలో 10 పాఠశాలు, డి కెటగిరీలో 1 పాఠశాల, ఈ కెటగిరీలో 1 పాఠశాల, ఎఫ్ కెటగిరీలో 3 మొత్తం 51 పాఠశాలలకు వంట పాత్రలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో వలంటీర్లదే కీలక పాత్ర

వేంపల్లె : ఇంటింటికి రేషన్ పంపిణీలో వలంటీర్లు కీలక పాత్ర పోషించాలని మండల తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో పట్టణ పరిధిలోని వలంటీర్లతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. డిసెంబర్ 1వ తేదీనుంచి ఇంటింటికి రేషన్ పంపిణీ కోసం వస్తున్న వాహనం వెంట వలంటీర్లు ఉండి కార్డుదారులకు కచ్చితంగా రేషన్ అందించే బాధ్యత తీసుకోవాలన్నారు. వలంటీర్లు వారికి కేటాయించిన ఏరియాలలో వాహనాలను పలుచోట్ల నిలుపుదల చేసే చెరక్ పాయింట్లను వలంటీర్లు నిర్ణయించాలన్నారు. వాహనం వెంట వలంటీర్లు ఉండి కార్డుదారులకు రేషన్ అందించాలన్నారు.

మాల మహానాడు నూతన కమిటీ ఎన్నిక

ఎర్రగుంట్ల : రాష్ట్ర మాల మహానాడు మండల నూతన కమిటీని రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేలు ఆదేశాల మేరకు ఎన్నుకోవడం జరిగిందని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ వినోద్ కుమార్ తెలిపారు. మాల మహానాడు మండల అధ్యక్షుడిగా యామవరం ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా తిమ్మాపురం సునీల్‌కుమార్, కార్యదర్శి గాటీ బాబు, మహిళా ప్రధాన కార్యదర్శిగా మేడిగ జ్యోష్నలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసం ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ధ్యేయం



రైతులకు భూపట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : భూమి లేని నిరుపేదలకు భూపంపిణీ కార్యక్రమంలో పట్టాలు అందజేసి వారి జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. పెండ్లిమర్రి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం భూపట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏళ్ల తరబడి భూమి సాగు చేసుకుని హక్కులు లేని రైతులకు భూ పంపిణీతో శాశ్వత భూహక్కు కల్పించారన్నారు. మండలంలో 32 మంది లబ్ధిదారులకు భూ పట్టాలు అందించామన్నారు. విటితో పాటు 22(ఏ)లో ఉన్న అసైన్డ్ భూములు, సర్వీస్ ఈనాం భూములుకు శాశ్విత హక్కు పత్రాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. దీంతో జిల్లాలో వేలాది మంది రైతులకు శాశ్విత ప్రయోజనం లభించిందన్నారు. అనంతరం రైతులకు భూపట్టాలు పంపణీ చేశారు. జెడ్పీ వైస్‌చైర్మన్ బాల య్య, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, పాలతల చైర్మన్ నాగమల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకవస్తున్నాడని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామ సచివాలయం పరిధిలో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో జర్వంతో పాటు ఇతర చిన్న అనారోగ్య సమస్యలు వచ్చిన సకాలంలో విలేజ్ క్లినిక్‌ల్లో వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతోనే సిఎం జగన్ విటిని ఏర్పాటు చేశారన్నారు. విలేజ్ క్లినిక్‌ల్లో ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని రకాల జబ్బులకు వ్యాక్సిన్లు వేస్తారన్నారు. తిప్పిరెడ్డిపల్లె గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఏపీకి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాల బోర్డును అవిష్కరించారు.

వయోజనులందరూ ఓటు హక్కు కలిగి ఉండాలి



ఓటు హక్కు అవగాహన ర్యాలీలో లయోలా డిగ్రీ కళాశాల విద్యార్థులు

పులివెందుల టౌన్ : 18 ఏళ్లు నిండిన వయోజనులందరూ ఓటు హక్కు కలిగి ఉండాలని.. లేని వారు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మార్కెటింగ్ శాఖ ఏడీ అజాద్, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డిలు తెలిపారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద నుంచి లయోలా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులచే ఓటు హక్కుపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 2, 3వ తేదీలలో ఓటు హక్కు నమోదుపై ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 18ఏళ్లు నిండిన వారు ఓటు హక్కును పొందాలన్నారు. ఈ ర్యాలీ కచేరి రోడ్డు, మెయిన్ బజార్ మీదుగా పూలంగళ్ల సర్కిల్ వరకు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత



క్రీడా సామగ్రిని పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు

చెన్నూరు : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తదితర క్రీడల పోటీల సామగ్రిని మండల అధ్యక్షుడు చీర్ల సురేష్‌యాదవ్ మండల పరిషత్ కార్యాలయం నుంచి ఆయా సచివాలయాలకు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గురువారం పంపిణీ చేశారు. 15 సంవత్సరాలు పైబడిన యువతి యువకులు ఈ క్రీడా పోటీలలో పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ, ఏఓ శకుంతల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఆడుదాం.. ఆంధ్రా’ను విజయవంతం చేయండి

లింగాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సురేంద్రనాథ్ అధికారులకు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని సచివాలయాలలో ఆడుదాం.. ఆంధ్రా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు. 15 ఏళ్లు నిండిన ఆడ, మగ క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీ, నాయకులందరూ కలిసి ఆడుదాం.. ఆంధ్రా అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జనవరి 26వ తేదీవరకు క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలకు రెండు జట్లు చొప్పున ఆడతారన్నారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిసెంట్లు, వలంటీర్లు క్రీడాకారుల పేర్లను నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లింగాల : మండల పరిధిలోని 33కె.వి పార్నపల్లె ఫీడర్ పరిధిలోని కర్ణపాపాయపల్లె, వెలిదండ్ల, పార్నపల్లె, కె.చెర్లోపల్లె గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు గమనించి సహకరించాలన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలి



పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర్‌రావు

పులివెందుల రూరల్ : మండలంలో వివిధ రకాల పంటలు సాగు చేసే రైతులు రబీలో ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ అధికారిణి నాగలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నవంబర్ 30వ తేదీనుంచి ఈ-క్రాప్ బుకింగ్ ప్రారంభమైందని.. సంబంధిత రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాలలో ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే పథకాలు రైతులకు అందాలంటే రైతులకు తప్పనిసరిగా ఆర్‌బీకేలలో ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

చెన్నూరులో..

చెన్నూరు : మండలంలో పంటలు వేసిన రైతులందరూ మీ గ్రామ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ని పట్టాదారు పాసుబుక్ లేదా సీసీఆర్‌సీ కార్డు, ఆధార్ కార్డుతో సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలో పంట వేసినప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ఉప్పరపల్లెలో ఆమె పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏ సలోమి, స్వీటీ రైతులు పాల్గొన్నారు..

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలో సాగు చేసిన ప్రతి పంటను రబీ 2023కు సంబంధించి నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వర్‌రావు తెలిపారు. గురువారం మండలంలోని అలిదెన, పాయసంపల్లె గ్రామాల్లో నిర్వహిస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎటువంటి అవకతవకలు లేకుండా ఖచ్చితంగా పంట నమోదు చేయాలని మండల, జిల్లా, డివిజనల్, రాష్ట్రస్థాయి అధికారులు నమోదు ప్రక్రియను తనిఖీ చేస్తారని ఏవైనా వ్యత్యాసాలు కనిపిస్తే వెంటనే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటారన్నారు. పంట నమోదు ఆధారంగానే పంటనష్ట పరిహారం, పంటల బీమా, సున్నావడ్డీ పంటరుణాలు వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తారన్నారు. పంట నమోదు సమయంలో కొత్త సర్వే నంబర్లు సరిహద్దులు చేసుకున్న తరువాతనే కెమెరా ఓపెన్ అవుతుందని జియో కోఆర్డినేట్ ఆధారంగా పంట నమోదు జరుగుతుదన్నారు. పంటలు సాగు చేసిన ప్రతి రైతు తమ 1బి, ఆధార్‌కార్డుతో తమ గ్రామ వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం మినుము పంటలో పల్లాకు తెగులు, బూడిద తెగులు ఉండటం గుర్తించామని నివారణకు మైక్లో బూటానిల్ లీటరు నీటికి 1 మి.లీ చొప్పున పంటపై పిచికారి చేసుకోవాలని రైతులకు తెలిపామన్నారు. రాబోయే రెండు మూడు రోజుల్లో అధికంగా వర్షాలు పడే అవకాశం ఉందని రైతులు జాగ్రత్తగా ఉండాలని పొలంలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ భాస్కర్‌రెడ్డి, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని తొల్లగంగనపల్లె వ్యవసాయ పొలాల్లో గురువారం ఏవో పర్యవేక్షణలో రబీ ఈ పంట నమోదు ప్రక్రియను మండల వ్యవసాయశాఖ అధికారి సాయిజ్యోతి ప్రారంభించి మాట్లాడారు. రైతు భరోసా, పండిన పంటలను కనీస మద్దతు ధరకు అమ్ముకునే అవకాశం, పంటల బీమా, సున్నా వడ్డీ, పెట్టుబడి రాయితీ వంటి ప్రభుత్వ పథకాలన్నింటికీ ఈ పంట నమోదు మూలమని వివరించారు. ఆర్‌బీకే సిబ్బంది కూడా ప్రతి రోజూ ఈ పంట నమోదు కోసం పొలాలకు వెళ్లే ముందు ఏ ఏ సర్వే నంబర్లలో పంట నమోదు చేయనున్నామో సంబంధిత రైతులకు తెలపాలన్నారు. పంట నమోదుతోపాటుగా ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు. రైతు సోదరులు ఈ పంట నమోదుతో బాటు ఈ కేవైసీ చేయించుకుని వ్యవసాయ శాఖకు సహకరించి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆమె కోరారు. వ్యవసాయ విస్తరణాధికారి మౌనిక, రైతులు పాల్గొన్నారు.

ప్రతి నిరుపేదకు ఇల్లు, భూమి ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ కొండారెడ్డి

చక్రాయపేట : మండలంలోని ప్రతి నిరుపేదకు జగనన్న ప్రభుత్వంలో ఇల్లు, జీవనానికి భూమి ఇవ్వాలన్న లక్ష్యం నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ భూమి ఎక్కడెక్కడ ఉందో గుర్తించి భూమిలేని వారికి పట్టాలు ఇచ్చేందుకు సిద్ధం చేసి పదిహేను రోజుల్లోపు ఈ కార్యక్రమం పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇదివరకే కొందరికి భూములకు సంబంధించిన పట్టాలు ఇచ్చామని ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారిని గుర్తించి పట్టాలు ఇవ్వాలన్నారు. ఇల్లు కూడా అర్హులై ఉండి ఎవరికైనా రాకపోతే వెంటనే అలాంటి వారిని గుర్తించి ఇల్లు కట్టుకునేలా చూడాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. అనంతరం బాలతిమ్మయ్యగారిపల్లె వద్ద 24 మంది లబ్ధి దారులకు ఇల్లు కట్టుకునేందుకు తయారు చేస్తున్న లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజసింహనరేంద్ర, ఎంపీ డీవో శివారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు అద్దె బస్సులు

మైదుకూరు : మైదుకూరు డిపో నుంచి శబరిమలకు ప్రత్యేక బస్సులను అద్దెకు నడుపుతామని డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. భక్తులు కోరిన మార్గాల్లో, కోరినన్ని రోజులు ప్రత్యేక బస్సు లను అద్దె కు ఇస్తామని ఆయన పేర్కొన్నారు. కేరళలో రాష్ట్ర ఆర్టీసీ బస్సులకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం ఉన్నట్టు తెలిపారు. కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఆర్టీఓ పన్నులు కూడా లేవని పేర్కొన్నారు. వంట మనుషులు, మణికంఠ స్వా మి, అటెండర్‌తో కలిపి ఏడుగురికి తమ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. మరిన్ని వివ రాలకు సెల్ నంబర్లు 7382866640, 7382865848 సంప్రదించాల ని కోరారు.

పులివెందుల ప్రాంత ప్రజలకు రుణపడి ఉంటాం



ఉత్తమ హీరోయిన్ అవార్డును అందుకుంటున్న మా ఊరి సినిమా హీరోయిన్ నేహారెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంత ప్రజలకు రుణపడి ఉంటామని మా ఊరి సినిమా హీరోయిన్ నేహారెడ్డి, ప్రొడ్యూసర్ కౌన్సిలర్ ప్రసన్నకుమార్‌లు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్‌లోని ఫిల్మ్ చాంబర్‌లో జోష్ మ్యూజిక్ అకాడమి వారు నిర్వహించిన ఎక్సలెంట్స్ అవార్డ్స్ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ కౌన్సిలర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గత 9 ఏళ్ల నుంచి రెండు తెలుగు రాష్ట్రాలలో ఎంతో మంది కళాకారులను ప్రోత్సహిస్తూ సంతోష్ త గరం అవార్డ్స్ ఫంక్షన్ ఏర్పాటు చేయడం పట్ల అభినందనీయమన్నారు. మా ఊరి సినిమా హీరోయిన్ నేహారెడ్డి మాట్లాడుతూ నాకు ఉత్తమ హీరోయిన్ అవా ర్డు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. పులివెందుల వాసులు ఆప్యాయంగా పలకరించడమే కా కుండా ఎంతో అభిమానించే వారన్నారు. జోష్ అవార్డ్స్ అధినేత సంతోష్ తగరం, ప్రముఖ తెలుగు చాంబర్ ఉపాధ్యక్షుడు ముత్యాల రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై పుస్తకావిష్కరణ



మహిళా సాధికారత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ యోగాంజనేయులు, తదితరులు

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్.సుగుణమ్మ స్వయం సహాయ బృందాల మహిళా సాధికారతపై రచించిన పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు గురువారం కళాశాలలో అధ్యాపకుల చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుగుణమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఆర్థిక సదుపాయాలను మహిళలు ఉపయోగించుకుని వారి ఎదుగుదలకు ఏ విధంగా దోహదపడతాయని క్లుప్తంగా వివరించామన్నారు. అలాగే పేదరికాన్ని, మహిళా సమస్యలను పరిష్కరించుకుని ఆర్థిక స్వావలంభన సాధించవచ్చుననే వివిధ అంశాలపై ఈ పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ సతీష్, పరీక్షల విభాగపు కో ఆర్డినేటర్ డాక్టర్ సుధాకర్, టీఎల్‌పీ కో ఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీని విజయవంతం చేయండి

పులివెందుల రూరల్ : ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని.. ప్రతి ఒక్కరూ డిసెంబర్ 1వ తేదీన నిర్వహించే ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని ఐసీటీసీ కౌ న్సిలర్లు వెంకటసుబ్బయ్య, బాదల్‌వలి, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజులు తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వారు ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీ కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. వ్యాధితో మరణించిన వారి కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేయడం కోసం అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. హెచ్ఐవీ సోకిన వారు చాలా జాగ్రత్తలు వహిస్తే కనీసం 25 ఏళ్లు బతికే అవకాశం ఉందన్నారు. ఒకవేళ బిడ్డ కడుపులో ఉండగా తల్లికి హెచ్ఐవీ లక్షణాలు కనిపిస్తే పుట్టబోయే బిడ్డకు హెచ్ఐవీ సోకకుండా తగిన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే సుఖ వ్యాధు లు సోకిన వారికి కూడా తగిన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎయిడ్స్ నియంత్రణ కోసం పులివెందుల పట్టణంలో శుక్రవారం చేపట్టే ర్యాలీని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

అబద్ధపు హామీలు నమ్మి మోసపోవద్దు



తిప్పలూరు గ్రామంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : తెలుగుదేశం నాయకులు చెబుతున్న అబద్ధపు హామీలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని వెల్దుర్తి సచివాలయంలో నిర్వహించిన ఆంధ్రకు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదవీ వ్యామోహంతో చంద్రబాబునాయుడు ప్రజలను మరోసారి మోసం చేసేందుకు తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు కలిసి గ్రామాల్లోకి వస్తున్నారని వారి మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నటువంటి పాలనకు ప్రజలు ఆకర్షితులై ఆయనకు అండగా నిలుస్తుండటంతో వారికి భయం పుట్టుకోస్తోందని ఎలాగైనా ప్రజలను పక్కదారి పట్టించాలన్న ఆలోచనలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, పరిశీలకుడు రాజుపాలెం జగన్‌రెడ్డి, సర్పంచు విశ్వనాథ్, స్థానిక నాయకులు గంగిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : రాష్ట్రంలో ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాయని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సియోన్‌పురం సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.అనంతరం సంక్షేమ పథకాల హోర్డింగ్‌ను వైఎస్ మనోహర్‌రెడ్డితో పాటు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లె కిశోర్‌ల ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం సియోన్‌పురంలో ఏర్పాటు చేసిన మా నమ్మకం నువ్వే జగన్ జెండాను ఆవిష్కరించి సియోన్‌పురం, ఫైర్‌స్టేషన్, గాంధీ నగర్, పురుషోత్తమరెడ్డి కాలనీలలో గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, కౌన్సిలర్లు రంగనాయకులు, ఖాదర్‌బాషా, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల సచివాలయ పరిధిలో గురువారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని జేసీఎస్ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. లబ్ధిదారులకు అందిన నిధుల వివరాల పట్టిక బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికి వెళుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావాలంటే ఏపీకి మళ్లీ జగనే సీఎం కావాలని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కరుణాకర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రవీంద్రనాథరెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలో..

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలని మైలవరం మండల ఎంపీపీ చేరెడ్డి సావిత్రి తెలిపారు. గురువారం దొమ్మరనంద్యాల గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమపథకాలు అందుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో జగనన్నకు పట్టం కట్టాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు మిలటరి గుర్విరెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు వైఎస్సార్‌సీపీ జెండా అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి తెలిపారు. గురువారం తిప్పలూరు గ్రామంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగుర వేసి అనంతరం సంక్షేమ బోర్డును ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తోందన్నారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి సీఎం చేసుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తారన్నారు. కార్యక్రమంలో మండల ఉప మండలాధ్యక్షుడు మల్లు మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ రంతుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్ని కేవలం రెండేళ్లలో 90 శాతం కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే 2024లో తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఏపీఐఐసీ రాష్ట్ర డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి, సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మీగాయత్రిలు తెలిపారు. గురువారం ఇడుపులపాయ గ్రామ సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల బోర్డును వారు ఆవిష్కరించి మాట్లాడారు. సచివాలయ పరిధిలో రూ.21.35కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశామన్నారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు గల వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. ఏఓ సోమశేఖరరెడ్డి, హజ్‌హౌస్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ మునీర్, ఇడుపులపాయ సర్పంచ్ నాగమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు తేజ, మాజీ సర్పంచ్ చలపతి, మాజీ ఎంపీటీసీ కొండయ్య, సచివాలయ కన్వీనర్లు శివ, దర్బార్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.